

భగవంతుడు కరుణించాడు..



తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయిన పుడు ప్రాణం పోయినంత బాధ కలిగింది. నేను 13 ఎకరాల సొంత పొలంతో పాటు 22 ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నాను. వరి సాగు కోసం దుక్కిదున్ని నారు వేసి సిద్ధం చేసుకున్నాను. అప్పులు చేసి పంటల సాగుకు సిద్ధమయ్యాను. ఆ సమయంలో గేట్ కొట్టుకుపోవడంతో నా పరిస్థితి ఏమిటని ఆందోళన కలిగింది. మళ్లీ డ్యాం నిండటంతో చాలా సంతోషంగా ఉంది. భగవంతుడు మమ్మల్ని కరుణించాడు. వర్షాలు కూడా పడుతున్నాయి. సాగునీరు అందుతోంది. పంటలు బాగా పండుతాయని నమ్మకం కలిగింది. పంట కోత వరకు నీరు అందుతుందనే ధైర్యం వచ్చింది. **- ఈశ్వర, ఆయకట్టు రైతు, శ్రీధరఘట్ట**

- క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయినా.. కరుణించిన నదీమతల్లి
- ఆగస్టు 10 రాత్రి విపత్తు.. 17న పరిష్కారం
- 105.7 నుంచి 70 టీఎంసీలకు పడిపోయిన నిల్వ
- స్టాప్‌లాగ్ అమర్చాక 20 రోజులకు గరిష్ఠ నిల్వల దిశగా..!
- పెరుగుతున్న వరద.. నేడు క్రస్ట్‌గేట్లు ఎత్తనున్న అధికారులు





నిండిన తుంగభద్ర జలాశయం

కన్నయ్య నాయుడు

పందనాలమ్మా తల్లీ..!

వర్షాలు బాగా కురిశాయి. తుంగభద్ర జలాశయం శరవేగంగా నిండింది. ఆయకట్టు రైతులు పంటల సాగుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే అనుకోని విపత్తు..! గత నెల పదో తేదీ రాత్రి డ్యాం 19 క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయింది. అప్పటికి డ్యాం నిల్వలు గరిష్ఠ స్థాయిలో ఉన్నాయి. నీరు మొత్తం నదిలోకి వెళుతోంది. డ్యాం ఖాళీ అయితే పరిస్థితి ఏమిటని అందరిలో ఆందోళన..! క్షణం వృథా చేయకుండా ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు స్పందించాయి. క్రస్ట్ గేట్‌ల నిపుణుడు కన్నయ్య నాయుడును సీఎం చంద్రబాబు రంగంలోకి దించారు. నష్ట నివారణ చర్యలు యుద్ధప్రాతిపదికన మొదలయ్యాయి. వారం వ్యవధిలో కొట్టుకుపోయిన క్రస్ట్‌గేట్ స్టాప్‌లాగ్ ఎలిమెంట్‌ను అమర్చారు. ఆ ప్రక్రియ నరాలు తెగే ఉత్కంఠ నడుమ సాగింది. చరిత్రలో నిచిపోయే ఘట్టం ఆవిష్కృతమైంది. దశాబ్దాల చరిత్ర ఉన్న జలాశయాలలో మునుముందు ఇలాంటి విపత్తు ఎదురైతే ఎలా ఎదుర్కోనాలో ఇంజనీరింగ్ నిపుణులు, కార్మికులు చేసి చూపించారు. కన్నయ్య నాయుడు అన్నట్లు.. ఇది ఒక మోడల్..! ఈ లోగా డ్యాంలో ఉన్న నీరు, ఆ తరువాత వచ్చిన వరద నీరు సుమారు 50 టీఎంసీలు నదిలోకి వెళ్లిపోయింది. సుమారు 70 టీఎంసీల నిల్వల వద్ద వృథాను అరికట్టారు. 'ఇంకా వర్షాలు ఉన్నాయ్..! భయపడాల్సింది ఏమీ లేదు..' అని ఒకరికొకరు ధైర్యం చెప్పుకున్నారు. ఆ రోజు రానే వచ్చింది. డ్యాంలో నీటి నిల్వలు మంగళవారం రాత్రికి 100.289 టీఎంసీలు నమోదయ్యాయి..! తాగు, సాగునీటికి సమస్య ఉండదని స్పష్టమైంది. ఇదే సమయంలో పై నుంచి వరద పెరుగుతోంది. డ్యాం క్రస్ట్ గేట్‌లను బుధవారం ఉదయం తెరిచి.. నదికి 5 వేల నుంచి 50 వేల క్యూసెక్కుల నీరు వదులుతామని బోర్డు అధికారులు ప్రకటించారు. ఇంతకంటే శుభవార్త అనంత రైతాంగానికి ఏముంటుంది..!

- రాయదుర్గం

తుంగభద్ర డ్యాం నిండితే ఎగువ కాలువ కింద జిల్లాలో 1.90 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. రాయదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ, శింగనమల నియోజకవర్గాల్లో వరి, మొక్కజొన్న, మిర్చి, పత్తి తదితర పంటలు పండుతాయి. కర్ణాటకలో కురిసే వర్షాలనుబట్టే జిల్లాలోని ఆయకట్టు రైతులు పంటలపై ఆశలు పెంచుకుంటారు. డ్యాంలోకి నీటి చేరిక మొదలవ్వగానే పొలాలను సిద్ధం చేసుకుంటారు. పెట్టుబడులకోసం అయినచోటల్లా అప్పులు చేస్తారు. తుంగభద్ర డ్యాం నిండితే.. జలాశయంతోపాటు వేలాది మంది రైతుల ముఖాలు కళకళలాడుతాయి. ఈ ఏడాది ఆ కళ ముందే కనిపించింది. కానీ ఆ రాత్రి జరిగిన సంఘటన రైతాంగంలో గుబులు పుట్టించింది. అప్పటికే లక్షలాది రూపాయల పెట్టుబడిని మట్టిలో పెట్టడమే దీనికి కారణం. డ్యాం మళ్లీ నిండటంతో అన్నదాతలు గుండెల నిండా ఊపిరి పీల్చుకుని.. రెట్టించిన ఉత్సాహంతో పొలాల్లోకి దిగారు.

అప్పులు తీరుతాయి..

ఎకరానికి రూ.25 వేల దాకా పెట్టుబడి పెట్టి వరి సాగు చేశాను. అప్పులు తీసుకు వచ్చి పంటను పెట్టాను. ఆ సమయంలో క్రస్ట్‌గేట్ కొట్టుకుపోవడంతో చాలా ఆందోళన కలిగింది. ఒక రకంగా కుంగిపోయాను. 18 ఎకరాల పొలంలో పంట పరిస్థితి ఏమవుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడిపాను. డ్యాం నిండటం చాలా ఆనందంగా ఉంది. కన్నయ్యనాయుడు లాంటి ప్రతిభావంతుడిని ప్రభుత్వం పిలిపించి పనులు చేయించింది. నీటిని కాపాడటంతోపాటు డ్యాం మళ్లీ నిండేలా చర్యలు తీసుకుంది. మాకు మళ్లీ ప్రాణం వచ్చినట్లైంది. చేసిన అప్పులు తీర్చుకోగలననే నమ్మకం కలిగింది.

-ఆంజనేయులు, ఆయకట్టు రైతు, గౌనూరు



తుంగభద్ర డ్యాంలో
100
టీఎంసీల నిల్వలు

పెరగనున్న వాటా

జిల్లాకు తాగు, సాగునీరు అందించే హెచ్చెల్సీకి నీటి వాటా పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది జలాశయం నుంచి 172 టీఎంసీల నీరు వినియోగించుకునే అవకాశం ఉంటుందని భావించారు. ఆ లెక్క ప్రకారం 26.368 టీఎంసీల నీరు హెచ్చెల్సీ వాటాగా కేటాయించారు. జలాశయం ఎగువ భాగంలో వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో ఈ నెలలో కూడా ఎక్కువగానే ఉంటుందని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రకారం హెచ్చెల్సీకి మరో రెండు టీఎంసీల దాకా నీటి వాటా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆంధ్ర సరిహద్దులో ఉన్న 105 కి.మీ. వద్ద 1809 క్యూసెక్కుల నీరు అందుతోంది. ఇప్పటివరకు 5.956 టీఎంసీల నీరు హెచ్చెల్సీ వాటా కింద విడుదల చేశామని అధికారులు అంటున్నారు. జిల్లాలో తాగునీటికి 10 టీఎంసీల నీరు అవసరం. మిగిలిన నీటిని సాగుకు వినియోగించేలా అధికారులు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. పీఏబీఆర్‌లో 1.783 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 1.155 టీఎంసీలు, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 4.150 టీఎంసీలు, మైలవరంలో 5.449 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. సాగుకు ఇప్పటికే హెచ్‌ఎంఎల్‌సీకి 2.67 టీఎంసీలు కేటాయించారు.

ఇంకోసారి ఇలా నిండింది..

తేదీ	నీటి నిల్వ (టీఎంసీలు)	చేరిన నీరు (టీఎంసీలు)	పెరిగిన నీరు (టీఎంసీలు)
17-8-2024	71.826		
18-8-2024	72.795	0.969	0.969
20-8-2024	76.916	4.121	5.090
24-8-2024	85.113	8.197	13.287
28-8-2024	88.755	3.642	16.929
01-9-2024	96.838	8.083	25.012
03-9-2024	100.289	3.451	28.463

నేడే విడుదల..

తుంగభద్ర జలాశయం నిండటంతో ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు ఊపిరి పీల్చుకున్నాయి. వంద టీఎంసీలకుపైగా నీటి నిల్వలతో జలాశయం కళకళ లాడుతోంది. జలాశయం ఎగువ భాగాన ఉన్న తుంగ, భద్ర, వరద నదుల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. మంగళవారం రాత్రికి నిల్వలు 100 టీఎంసీలు దాటాయి. దీంతో బోర్డు అధికారులు అప్రమత్తమయ్యారు. క్రస్ట్‌గేట్లను బుధవారం ఎత్తి నదికి నీరు వదలాలని నిర్ణయించారు. తుంగభద్ర జలాశయానికి ఇప్పటి వరకు 308 టీఎంసీల నీరు లభ్యమైనట్లు బోర్డు అధికారులు నిర్ధారించారు. ఇందులో 175 టీఎంసీల నీరు నదికి వదిలారు. ఏపీ, కర్ణాటక వాటాల మేరకు 33 టీఎంసీల నీటిని కాలువలకు వదిలారు. డ్యాంకు ఎగువన ఉన్న తుంగ, భద్ర జలాశయాలు కూడా నిండటంతో నీటిని దిగువకు వదులుతున్నారు. జలాశయం ఎగువన పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇన్‌ఫ్లో మంగళవారం రాత్రికి 37,127 క్యూసెక్కులకు చేరింది. రెండు రోజుల్లో మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. డ్యాం నీటిమట్టం 1633 అడుగులు కాగా.. ప్రస్తుతం 1632 అడుగుల వరకూ నీరు చేరింది. కాలువలకు 15,264 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.

ఆ రాత్రి అలజడి..!

ఆగస్టు 10వ తేదీన రాత్రి 19వ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయింది. అప్పటికి జలాశయంలో 105.788 టీఎంసీల నీరు ఉంది. గేట్ కొట్టుకుపోవడంతో స్టాప్‌లాగ్ అమర్చేందుకు వారం రోజుల పాటు జలాశయంలోని నీటిని నదికి వదలాల్సి వచ్చింది. ఆగస్టు 17న స్టాప్‌లాగ్ అమర్చే ప్రక్రియ ముగిసింది. అప్పటికి డ్యాం నిల్వలు 70 టీఎంసీలకు పడిపోయాయి. నష్టపోయిన 32 టీఎంసీల నీరు తిరిగి లభ్యం కాకపోతే రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. రెండు రాష్ట్రాల పరిధిలో నాలుగు జిల్లాల ప్రజలకు తాగు, సాగునీటి సమస్య తలెత్తుతుంది. మిగిలిన 30 టీఎంసీల నీరు డ్యాంలోకి చేరాలని అన్నదాతలు ప్రార్థనలు చేశారు. రోజూ 30 వేల క్యూసెక్కులకు అటూ ఇటూగా చేరుతూ.. చివరకు మంగళవారం రాత్రికి 100 టీఎంసీలు దాటింది. క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయిన తరువాత 23 రోజుల అనంతరం జలాశయం నిండి.. ఇంకోసారి క్రస్ట్‌గేట్లు ఎత్తే అవకాశం రావడంతో అన్ని వర్గాల్లో ఆనందం కనిపిస్తోంది.

ఐఏబీ సమావేశం ఏర్పాటుకు సన్నద్ధం

హెచ్చెల్సీ నుంచి జిల్లాకు అందే జలాలను వినియోగించుకునేందుకు అవసరమైన ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు. దీని ఆమోదం కోసం ఐఏబీ సమావేశం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. తేదీ ఖరారు కోసం ఇప్పటికే కలెక్టర్‌ను సంప్రదించినట్లు తెలిసింది. సాగు, తాగునీటి కేటాయింపులు, క్షేత్రస్థాయి సమస్యలను చర్చించేందుకు ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు సమావేశం నిర్వహిస్తారు. ఇందులో ప్రజాప్రతినిధులతో పాటు జలవనరుల శాఖ అధికారులు పాల్గొని.. తీర్మానాలు చేస్తారు.



ఆయకట్టులో జోరుగా వరినాట్లు

పచ్చ పచ్చాని చేలు..

తుంగభద్ర ఎగువ కాలువ కింద ఆయకట్టులో పంటసాగు పనులు పుంజుకున్నాయి. క్రస్ట్‌గేట్ కొట్టుకుపోవడంతో డీలా పడిన రైతులు.. తాజాగా వంద టీఎంసీల నీటి చేరికతో హుషారయ్యారు. కణేకల్లు, బొమ్మనహాళ్, విడపనకల్లు, ఉరవకొండ తదితర ప్రాంతాల్లో హెచ్చెల్సీ ఆయకట్టులో వరి, మిరప, పత్తి, మొక్కజొన్న తదితర పంటల సాగు పనుల వేగం పెంచారు. ఎగువ కాలువలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకపోవడంతో పొలాలకు నీరు తగినంత చేరుతోంది. ఇప్పటికే వరినారు సిద్ధమైంది. ప్రతికూల వాతావరణం నుంచి అనుకూల వాతావరణంలోకి రావడంతో రైతులు మరింత ఉత్సాహంతో ముందుకెళుతున్నారు. డిస్ట్రిబ్యూటరీల నుంచి సమృద్ధిగా నీరు అందుతోందని, దీనికితోడు వర్షాలు పడుతున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎటు చూసినా ఆయకట్టు రైతులు బిజీ బిజీగా కనిపిస్తున్నారు.



నిర్ణయాల్లో గందరగోళం

వైసీపీ నీడలో విద్యాశాఖ

- టీచర్స్ డే వేదిక ఎంపికే నిదర్శనం
- జడ్పీ హాల్ అన్నట్లు ఆహ్వాన పత్రికలు
- తాజాగా ఆర్ట్స్ కాలేజీ డ్రామా హాల్‌కు మార్పు

అనంతపురం విద్య, సెప్టెంబరు 3: 'ట్వంటీ ఇయర్స్ బ్యాక్.. సేమ్ కార్డ్స్ ప్రింటెడ్.. నేమ్స్ డిఫరెంట్. టూ వీక్స్ హ్యాపీస్..! దెన్ స్టార్టెడ్ స్ట్రగుల్..! నేమ్ డిలీటెడ్..' ఈ డైలాగ్ గుర్తుందా..? మనీ సినిమాలో పెళ్లి గురించి కోటా శ్రీనివాసరావు చెబుతారు. అచ్చం ఇలాంటిదే. కానీ పెళ్లి కాదు. గురు పూజోత్సవం. విద్యాశాఖ ఆధ్వర్యంలో కార్డ్స్ ప్రింటెడ్..! దెన్ వెన్యూ చేంజ్‌డ్..! అగెయిన్ కార్డ్స్ ప్రింటెడ్..! ఇలా సాగుతోంది వ్యవహారం. విద్యాశాఖ జిల్లా అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు ఆ శాఖను అభాసుపాలు చేస్తున్నాయి. ఎక్కడైనా వేదికను ఖరారు చేసుకున్నాక ఆహ్వాన పత్రికలను ముద్రిస్తారు. జిల్లా విద్యాశాఖలో ఆహ్వాన పత్రికను ముద్రించి.. ప్రచారం చేసి.. ఆ తరువాత వేదికను మార్చుకున్నారు. తాజాగా కొత్త కార్డులను ముద్రించారు. ప్రతి సంవత్సరం సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేసి సత్కరిస్తుంటారు. ఈ ఏడాది కూడా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. డీఈఓ కార్యాలయంలోని ఒకరిద్దరు అధికారులు, పలువురు ఉపాధ్యాయులు దీని గురించి చర్చించుకున్నారు. వేదిక కోసం ఆర్ట్స్ కాలేజీని పరిశీలించారు. ఆ తరువాత జడ్పీలోని డీపీఆర్సీ మీటింగ్ హాల్‌ను ఎంపిక చేసుకున్నారు. మంత్రులు, కలెక్టర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులకు ఇచ్చే ఆహ్వాన పత్రికలను ముద్రించారు. ఆ తరువాత వేదిక సరిపోదు అనుకున్నారు. మొదట చూసిన ఆర్ట్స్ కాలేజీలో వేడుక నిర్వహించాలని నిర్ణయించారు.



జడ్పీలోని డీపీఆర్సీ భవన్‌లో మీటింగ్ అంటూ మొదట ముద్రించిన కార్డు



ఆర్ట్స్ కాలేజ్ డ్రామా హాల్‌లో గురు పూజోత్సవం అంటూ ముద్రించిన కార్డు

వైసీపీవారి కుయుక్తులు..?

ఉపాధ్యాయ దినోత్సవం విషయంలో గందరగోళం వెనుక వైసీపీ మద్దతుదారులైన కొందరు ఉపాధ్యాయుల కుయుక్తులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. జడ్పీ మీటింగ్ హాల్ చాలా చిన్నది. అవార్డులు తీసుకునే టీచర్లు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, అవార్డు కమిటీ సభ్యులు.. అందరూ కలిసి 500 మందికిపైగా వస్తారు. వందమంది కూడా పట్టని జడ్పీ హాల్‌ను వేడుకలకు ఎంపిక చేయించి.. కార్యక్రమాన్ని చెడగొట్టాలని, ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని కొందరు ఉద్దేశపూర్వకంగా ఇలా చేశారని ఆరోపణలు వస్తున్నాయి. వైసీపీ నీడలో నడిచే ఉపాధ్యాయులు, అనుభవం లేని కొందరు టీచర్లు, ప్రధానోపాధాయులు పెద్దమనుషుల అవతారం ఎత్తి.. డీఈఓ చేత పొరపాటు చేయించారని సమాచారం. ఆహ్వాన పత్రికలు సిద్ధం కాగానే వైసీపీ బ్యాచ్ ఉపాధ్యాయులు సోషల్ మీడియాలో ముమ్మరంగా పోస్టు చేశారు.

మళ్లీ డ్రామా హాల్‌కు..

జడ్పీలో వేడుక నిర్వహిస్తే ఇబ్బందులు తప్పవని ఆప్టా, ఎస్టీయూ, యూటీఎఫ్, ఎస్టీపీ తదితర సంఘాల నేతలు విద్యాశాఖ అధికారులకు అభ్యంతరం తెలిపారు. ప్రతి సంవత్సరం ఆర్ట్స్ కాలేజీ డ్రామా హాల్‌లోనే వేడుకలు నిర్వహిస్తారని డీఈఓకు గుర్తు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు వెంకటరత్నం, బండారు శంకర్, చల్లా ఓబులేసు, రామాంజినేయులు, కోటేశ్వర్‌రావు, రామాంజినేయులు, భుక్యానాయక్, రామాంజినేయులు, తదితరులు ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను కలిశారు. వేడుకకు అనుమతి ఇవ్వాలని కోరి.. వినతిపత్రం ఇచ్చి ఒప్పించారు. ప్రిన్సిపాల్ అంగీకారం తెలుపడంతో రుసుం చెల్లించారు. ఫైనల్‌గా ఆర్ట్స్ కాలేజీ డ్రామా హాల్‌లో గురుపూజోత్సవం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. కొత్త వేదిక పేరుతో కార్డులు ముద్రించి, ముఖ్య అతిథులను, అతిథులను ఆహ్వానించారు. ప్రభుత్వం మారినా విద్యాశాఖలో వైసీపీ మద్దతు టీచర్ల హవా నడుస్తోందని, అందుకే గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయని పలువురు ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు.

మంత్రి లోకేశ్

వస్తారు.. జాగ్రత్త

విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ హెచ్చరిక



అనంతపురం టౌన్, సెప్టెంబరు 3: విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాఠశాలలు తనిఖీకి వస్తున్నారని, అందరూ అప్రమత్తంగా ఉంటూ బాధ్యతగా పనిచేయాలని విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో మధ్యాహ్న భోజన పథకంపై మంగళవారం సమీక్షించారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు. మంత్రి నారా లోకేశ్ అన్ని జిల్లాలలో పాఠశాలలను తనిఖీ చేస్తున్నారని, బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. తాను జిల్లాలో చాలా పాఠశాలలను తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశానని అన్నారు. ఆకు కూరలు తక్కువగా వాడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని సూచించారు. చాలామంది విద్యార్థులు పులిహోర, వెజ్ పలావ్‌ను ఇష్టపడటం లేదని అన్నారు. ఉడికించిన కోడిగుడ్లను కూడా రోజూ తినడానికి పిల్లలు ఇష్టపడటం లేదని అన్నారు. బదులుగా ఆమ్లెట్స్, కోడిగుడ్ల కూర ఇవ్వాలని సూచించారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన ఆహారపు అలవాట్లు ఉన్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని అన్నారు. విద్యార్థులకు మెరుగైన భోజనం అందేలా చూడాలని ఆదేశించారు. సమీక్షలో డీఈఓ వరలక్ష్మి, ఏపీసీ నాగరాజు, ఎంఈఓలు, మోడల్, రెసిడెన్సియల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

కోర్టు కేసులపై నిర్లక్ష్యం వద్దు

కోర్టు కేసులు విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని వివిధ శాఖల అధికారులకు కలెక్టరు సూచించారు. కంటెంప్ట్ కేసులు కోర్టులో నమోదైన వెంటనే పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. సమీక్షలో డీఆర్వో రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అనంత వెంకటరామిరెడ్డి

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా అనంత

అనంతపురం క్రైం, సెప్టెంబరు 3: వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికల వరకు పైలా నరసింహయ్య జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన ఇటీవల పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆయన స్థానంలో మాజీ ఎమ్మెల్యే అనంతను నియమించారు. నాలుగురు సార్లు ఎంపీ, ఒకే సారి ఎమ్మెల్యేగా అనంత ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి చేతిలో ఓడిపోయారు. పార్టీ జిల్లా అధ్యక్ష పదవి తీసుకునేందుకు ఆయన విముఖత వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో నలుగురు నాయకులు తీవ్రంగా ప్రయత్నించారు. పార్టీ అధినాయకత్వం అనంతకే పగ్గాలు అప్పగించింది.

గుంటూరు గర్భిణికి బాంబే బ్లడ్

దానం చేసిన గుంతకల్లు వాసి



గోపీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న పరశురామ్

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 3: గుంటూరుకు చెందిన ఓ గర్భిణికి ప్రసవ సమయంలో అవసరమైన ఓ నెగిటివ్ బాంబే గ్రూప్ రక్తాన్ని గుంతకల్లు పట్టణానికి చెందిన పరశురామ్ దానం చేశాడు. గుంటూరు సాయిరత్న ఆసుపత్రిలో ప్రసవం కోసం కస్తూరి అనే మహిళ చేరారు. ఆమెకు రక్తం తక్కువగా ఉందని, రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించారు. ఆమెది అరుదైన ఓ నెగిటివ్ బాంబే బ్లడ్ గ్రూప్ కావడంతో కుటుంబ సభ్యులు ఆ రక్తం కోసం కర్నూలులోని ఓ రక్తదాతకు సంప్రదించారు. గుంతకల్లులో పరశురామ్‌ది అదే గ్రూప్ అని తెలుసుకుని.. కస్తూరి కుటుంబ సభ్యులు గుంటూరు నుంచి మంగళవారం ఉదయం గుంతకల్లుకు చేరుకున్నారు. పట్టణంలోని గోపీ బ్లడ్ బ్యాంకులో పరశురామ్ రక్తదానం చేశాడు. ఆ రక్తాన్ని తీసుకుని కస్తూరి కుటుంబ సభ్యులు గుంటూరు సాయంత్రం రైలులో బయలుదేరారు. రక్తదానం చేసిన పరశురామ్‌కు కస్తూరి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు శాంతియుత నిరసన

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 3: జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తిస్తూ, శాంతియుత నిరసన వ్యక్తం చేస్తారని ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, నాయకులు హరీష్‌కుమార్, మహేంద్ర, మహేష్ తెలిపారు. మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ.. తమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 7న మద్యం దుకాణాలను బంద్ చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే ఐఎంఎల్ డిపో మేనేజర్‌కు బంద్ నోటీసులు ఇచ్చామని అన్నారు.





పొలాల్లో చేరిన నీరు.. నీరు బయటకు వెళ్తున్న ప్రదేశం

తెగిన కాలువ.. పొలాల్లోకి నీరు

కూడేరు, సెప్టెంబరు 3: చోళసముద్రం సమీపంలోని ముద్దలాపురం, ఇప్పేరు చెరువులకు నీటిని తరలించే హంద్రీనీవా కాలువ తెగిపోయింది. దీంతో పొలాల్లోకి నీరు చేరి పంటలు కొట్టుకుపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్, జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. హంద్రీ-నీవా ఎస్‌ఈ దేశేనాయక్, ఈఈ స్వరూప్‌కుమార్ తదితరులు కాలువ తెగిన ప్రాంతాన్ని మంగళవారం సందర్శించారు. సమస్యను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

ఇద్దరు మాత్రమే విధుల్లోకి...

అనంతపురం విద్య, సెప్టెంబరు 3: సమగ్రశిక్ష ప్రాజెక్టు నుంచి విద్యాశాఖకు రీప్యాట్రియేషన్ అయిన ఆరుగురు ఉపాధ్యాయులలో ఇద్దరు మాత్రమే తమ పాఠశాలల్లో విధుల్లో చేరారు. ప్రాజెక్టు నుంచి రీప్యాట్రియేషన్ అయిన ఆరుగురు టీచర్లలో గోపాలక్రిష్ణ, మాధవరెడ్డికి అనంతపురం నగరానికి సమీపంలోని పాఠశాలల్లో పోస్టింగ్ ఇచ్చారు. చంద్రశేఖర్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, గోవింద్‌రెడ్డికి పాత స్థానాలనే కేటాయించారు. మరో టీచర్ చంద్రమోహన్‌రెడ్డిని ఉరవకొండకు కేటాయించిన విషయం తెలిసిందే. గోపాలక్రిష్ణ, మాధవరెడ్డి తమకు కేటాయించిన పాఠశాలల్లో చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి ఇంకా విధుల్లో చేరలేదు. తమకు అన్యాయం జరిగిందని వారు బాధపడుతున్నట్లు సమాచారం. చంద్రమోహన్ రెడ్డి సైతం పాఠశాల విధుల్లో చేరలేదు. చంద్రమోహన్ రెడ్డి దంపతులు ఉదయం జిల్లా కలెక్టర్‌కు కలసి తమ కూతురు అనారోగ్య సమస్యను వివరించి, మరోచోట పోస్టింగ్ ఇవ్వాలని విన్నవించుకున్నట్లు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలిసింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయిని మహేశ్వరి సైతం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

అమ్మబోతే అడవి..!

స్థానికంగా మార్కెట్‌లేక రైతుల ఇబ్బందులు

ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో కర్ణాటకకు పంట దిగుబడులను తరలిస్తున్నారు. ఈ పరిస్థితిని ముఖ్యంగా కూరగాయలు సాగు చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్నారు. - చెన్నేకొత్తపల్లి

కూరగాయలు అమ్ముకునేందుకు తీవ్ర కష్టాలు

పంట దిగుబడులను కర్ణాటకకు తరలిస్తున్నవైనం


గోరు చిక్కుడును గ్రేడింగ్ చేస్తున్న మహిళా కూలీలు

ఉమ్మడి జిల్లాలో వర్షాభావంతో బోరు బావుల్లో నీరు తగ్గిపోవడంతో ఇతర పంటలను వదిలేసి ఎక్కువ మంది రైతులు కూరగాయల సాగువైపు మళ్లారు. ఎకరం నుంచి మూడెకరాల వరకు కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి

ఎకరం నుంచి మూడెకరాల వరకు..

మండలాల్లో కూరగాయల సాగు బాగా పెరిగింది. టమోటాకు మాత్రమే జిల్లాలో మార్కెట్ సౌకర్యం ఉండగా ఇతర కూరగాయలకు లేకపోవడంతో



సమీపంలోని కర్ణాటకకు తరలిస్తున్నారు. దీంతో ఖర్చులు రెట్టింపు అయ్యి పెద్దగా గిట్టుబాటు కావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు మండలాల్లో పెరిగిన సాగు

కరువు ఛాయలు ఉన్న రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో చాలా మంది రైతులు కూరగాయల సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. బోరుబావుల్లో నీరు తగ్గిపోవడం, పెట్టుబడి భారం దృష్ట్యా గోరుచిక్కుడు, బెండ, టమోట, మిరప, అనప, చిక్కుడు వంటి పంటలను సాగుచేస్తున్నారు. ఈ మూడు మండలాల్లో దాదాపు 1000 హెక్టార్లకు పైనే కూరగాయల సాగు చేస్తున్నారు. దిగుబడి బాగానే ఉన్న మార్కెట్ సౌకర్యం లేక పంటను అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. పండిన పంటను గ్రామీణ ప్రాంతాల నుంచి ఆటోల్లో మండల కేంద్రాలకు తరలించి అక్కడి నుంచి బొలెరో వంటి వాహనాల్లో బాగేపల్లి, బెంగళూరు, కోలార్ తదితర పట్టణాలకు తరలిస్తున్నారు. వంద కిలోల బస్తాకు రూ. 250 నుంచి రూ.300 రవాణా ఖర్చు వస్తోందని రైతులు చెబుతున్నారు. ఒక్కోసారి హఠాత్తుగా ధరలు తగ్గినప్పుడు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం సరైన మార్కెట్ సౌకర్యాన్ని కల్పించి తమ కష్టాలను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

తడిసి మోపెడవుతున్న ఖర్చు



ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి పంటలను సాగు చేసుకుంటున్నాం. దిగుబడి బాగున్నా పండిన పంటను అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పొలం నుంచి మార్కెట్‌కు తరలించే పాటికి ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. స్థానికంగానే మార్కెట్ సౌకర్యం కల్పించాలి

- నరేంద్రరెడ్డి, రైతు, మామిళ్లపల్లి


గోరుచిక్కుడు తోట


కూరగాయలను బెంగళూరు మార్కెట్‌కు తరలించేందుకు సీకేపల్లిలో లోడ్ చేస్తున్న రైతులు

మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి



పండించిన పంటను అమ్ముకోవడానికి సరైన మార్కెట్ సౌకర్యం లేదు. ఒక టమోట తప్పా మిగిలిన కూరగాయలను కర్ణాటకకు తీసుకెళ్లి అమ్ముకోవాల్సిందే. రైతుల ఇబ్బందులను చూసి జిల్లాలో మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే రైతుకు ఎంతో మేలు జరుగుతుంది.

- అంజి, రైతు, ప్యాదిండి

కేసుల పరిష్కారానికి కృషి చేయండి: జిల్లా న్యాయాధికారి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 3: జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి కక్షిదారుల్లో అవగాహన పెంచి, కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. జిల్లా కోర్టులో ఈనెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ నేపథ్యంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు సంబంధించిన అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌కు మరిన్ని కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

అరటి నారతో అల్లికలపై శిక్షణ


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 3: అరటి నారతో వివిధ అల్లికల తయారీపై మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు తెలిపారు. మండలంలోని కురుగుంటలో అనంత గ్రామీణ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ కలెక్షన్ సెంటర్‌కు ఉద్యానశాఖ 75శాతం రాయితీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సెంటర్‌ను రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. మూసా ఫైబ్రెల్ అనే సంస్థ మహిళలకు అరటి నార తీసి చేతి సంచులు, ఇంటి అలంకరణ వస్తువులు, పేపర్ తయారీ, వస్త్రాల తయారీపై శిక్షణ ఇస్తుందన్నారు. జిల్లాలో దాదాపు 25వేల ఎకరాల్లో అరటి సాగు అవుతోందని, గెలలు కోసిన తరువాత రైతులు అరటి బోదెలను పడేయకుండా విక్రయించి మరింత ఆదాయం పొందవచ్చన్నారు. మూసా ఫైబ్రెల్ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ అరటి నారతీసే యంత్రం, కటింగ్ మిషన్ ఒకటిన్నర లక్షల రూపాయలకు అందిస్తామన్నారు. దీని ద్వారా రోజుకు 25 కిలోల నార తీయవచ్చున్నారు. అరటి నారా ఉత్పత్తులకు దేశీయంగా విదేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. మహిళా రైతులకు ఉచిత శిక్షణతో పాటు రోజుకు రూ.300 అందజేస్తామన్నారు. శిక్షణ అనంతరం ఇంటి వద్దే అరటి పీచుతో వివిధ వస్తువులు తయారు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి నాబార్డు ఏజీఎం అనురాధ, అనంతపురం డివిజన్ వ్యవసాయాధికారి రవి, మండల ఉద్యానశాఖ అధికారిణి రత్నకుమారి, రెడ్స్ సంస్థ భానుజా తదితరులు పాల్గొన్నారు.

పండుగలా..

- ☆ దులీప్‌ట్రోఫీ నిర్వహణపై రాజీపడొద్దు
- ☆ ప్రజలు, విద్యార్థులు ఆస్వాదించేలా ఏర్పాట్లు
- ☆ ట్రాఫిక్, పార్కింగ్ సమస్య లేకుండా చూడండి
- ☆ అధికారులతో సమీక్షలో కలెక్టర్ వినోద్‌కుమార్


దులీప్‌ట్రోఫీ నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 3: జిల్లాలో తొలిసారి నిర్వహించే దులీప్‌ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లను ప్రజలు పండుగలా ఆస్వాదించేలా అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. దులీప్‌ట్రోఫీకి సంబంధించి ఏసీజీలో చేపడుతున్న ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఏమాత్రం రాజీ పడకుండా దులీప్ ట్రోఫీ నిర్వహించాలన్నారు. గ్రౌండ్ వద్ద బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. గ్రౌండ్‌లోకి క్రీడాకారులు, సిబ్బంది, ప్రతినిధులు, పబ్లిక్ ఎంట్రీ, ప్రెస్, వీఐపీలు, వీవీఐపీలు వచ్చి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ట్రాఫిక్, పార్కింగ్ సమస్య రాకుండా చూడాలన్నారు. మ్యాచ్‌లను చూసేందుకు జేఎన్‌టీయూ, ఎస్కేయూ, సెంట్రల్ యూనివర్సిటీ, ఒకేషనల్ ఎడ్యుకేషన్, ఆయా విద్యాసంస్థల విద్యార్థులను తీసుకురావాలని సూచించారు. తాగునీటి వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ అమిత్ సిద్దేశ్వర్, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, ఆర్డీఓ వసంతబాబు, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, డీపీఓ ప్రభాకర్ రావు, డీఎస్‌డీఓ షఫీ, డీఎంహెచ్ఓ ఈబీదేవి, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసొరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్, సీట్లు కేటాయింపు

దులీప్‌ట్రోఫీకి సంబంధించి క్రికెట్ పోటీలు గురువారం నుంచి అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ప్రారంభించనున్నారు. ఈ మ్యాచ్‌లను వీక్షించడానికి వచ్చే వారికి వాహనాల పార్కింగ్, ప్రవేశాలు, సీట్ల కేటాయింపులు చేశారు. ఉదయం ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ హరికుమార్, బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్, జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు బ్లాక్‌లు, పార్కింగ్ స్థలాలను పరిశీలించి, మ్యాప్‌ను తయారు చేశారు. మొత్తం ఆరు గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఏ బ్లాక్‌లో బీసీసీఐ ప్రతినిధులకు కేటాయించారు. బీ బ్లాక్‌లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు కేటాయించారు. సీ, డీ, ఈ, ఎఫ్ బ్లాక్‌లు సాధారణ ప్రేక్షకులకు కేటాయించారు. ఎఫ్ బ్లాక్ పక్కన మీడియా గ్యాలరీ ఏర్పాటు చేశారు.

పార్కింగ్ వాహనాలు ఇలా...

మ్యాచ్‌కు వచ్చే వారి వాహనాల పార్కింగ్‌కు నాలుగు ప్రాంతాలు కేటాయించారు. ప్లేయర్ల వాహనాలు, ఏ, బీ గ్యాలరీలలోకి వెళ్లే వారు గేట్ నంబరు- 2లో వెళ్లి వాహనాలు నిలపాలి. గేట్-1లో వాహనాలకు అనుమతి లేదు. గేట్-1 నుంచి సీ, డీ, ఈ, ఎఫ్ గ్యాలరీలలోకి పాసులు కల వారు నగరంలో నుంచి వచ్చే సాధారణ వాహనాలు నగరవనం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశాల్లో పార్కింగ్ చేసి లోపలికి నడకదారిలో వెళ్లాలి. ఇక కదిరి, ఎస్కేయూ, రాప్తాడు వైపు నుంచి వచ్చే వాహనాలకు సెయింట్ డీ-పాల్ స్కూల్‌లో పార్కింగ్ కేటాయించారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

దులీప్‌ట్రోఫీకి సంబంధించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ జగదీష్ నేతృత్వంలో పోలీసులు భద్రతా చర్యలు చేపడుతున్నారు. సుమారు 400మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. ప్లేయర్లు బసచేస్తున్న అలెగ్జాండర్, మానినేని హోటళ్ల వద్ద సాధారణ పోలీసులతో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇక ప్లేయర్లు హోటల్ నుంచి గ్రౌండ్‌కు వెళ్లి వచ్చే దారిలో పోలీసులు ప్రత్యేకంగా కాన్వాయ్ ఏర్పాటు చేశారు. ఇక అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో అడుగడుగున పోలీసుల నిఘా కొనసాగుతోంది. పోలీసులతో పాటు ప్లేయర్లకు బౌన్సర్లను రక్షణగా ఏర్పాటు చేశారు. ఈనెల 5 నుంచి 22 వరకు ఐదు మ్యాచ్‌లు ఏసీజీలో నిర్వహించనున్నారు.

జీడిపల్లికి 1085 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 3: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 1085 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 830 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. మరువ ద్వారా పీఏబీఆర్‌కు 210 క్యూసెక్కుల వెళ్తున్నట్లు వెల్లడించారు.

సాధన ప్రారంభం


ఆటగాళ్ల సాధన


ప్రాక్టీస్‌కు వస్తున్న క్రికెటర్లు







అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 3: దులీప్‌ట్రోఫీలో ఆడేందుకు నగరానికి వచ్చిన భారత క్రికెట్ క్రీడాకారులు మంగళవారం సాధన ప్రారంభించారు. బస చేసిన అలెగ్జాండర్ హోటల్ నుంచి పోలీసు ఎస్కార్ట్‌తో ఏసీజీకి వచ్చిన ఆటగాళ్లు అక్కడ ప్రాక్టీస్ చేశారు. ఇండియా-సీ జట్టులో భారత కీలక ఆటగాళ్లు రుత్‌రాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటీదార్, అభిషేక్ పోరెల్, బి ఇంద్రజిత్, హృతిక్ షోకీన్, మానవ్ సుతార్, గౌరవ్‌యాదవ్, వైషాక్ విజయ్‌కుమార్, అన్షుల్ కాంబోజ్, హిమాన్షుచౌహాన్, మయాంక్ మార్కండే, సందీప్ వారియర్ ఉన్నారు. ఇండియా-డీ జట్టులో...శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), అతర్వ తైడే, యష్‌దూబే, దేవ్‌దత్ పడిక్కల్, ఇషాన్‌కిషాన్, రిక్కీభుయ్, సరాన్స్ జైన్, అక్షర్‌పటేల్, అర్షదీప్‌సింగ్, ఆదిత్యథాక్రే, హర్షిత్‌రాణా, తుషార్ దేశ్‌పాండే, ఆకాష్‌సేన్ గుప్తా, కేఎస్ భరత్, సౌరభ్‌కుమార్‌లు ఏసీజీలో నిర్వహించిన ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు. అంతకు ముందు బీసీసీఐ ప్రతినిధులు అమిత్ సిద్దేశ్వర్, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యులు మాంచో‌ఫెర్రర్, ఇతర ప్రతినిధులు ఏసీజీలో ప్రాక్టీస్‌కు సంబంధించిన, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇండియా సి, డి జట్ల ఆటగాళ్లు ఏసీజీలో నెట్ ప్రాక్టీస్ చేశారు.





అప్రమత్తంగా ఉండండి: డీడీ


వార్డెన్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న బీసీ, ఎస్సీ సంక్షేమశాఖల డీడీ కుష్బూకొఠారీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 3: వర్షాల నేపథ్యంలో ప్రతి హాస్టల్ వార్డెన్ అప్రమత్తంగా ఉండాలని బీసీ, ఎస్సీ సంక్షేమశాఖల డీడీ కుష్బూకొఠారీ ఆదేశాలు జారీ చేశారు. సీపీఓ కార్యాలయంలో జిల్లాలోని బీసీ, ఎస్టీ వార్డెన్లతో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 100 రోజులు, 500 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత వర్షాకాలంలో కొన్ని హాస్టల్ భవనాల్లో నీరు కారుతోందని, వాటిపట్ల దృష్టి సారించి సాధ్యమైనంత వరకూ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రహరీలు పడిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉండటంతో ఎప్పటికప్పుడు విద్యార్థులకు మందులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే విషయంపై డీఎంహెచ్ఓకు లేఖ రాశామన్నారు. వార్డెన్లు కూడా సమీపంలో ఉన్న వైద్యులని కలిసి విద్యార్థులకు వైద్య చికిత్స అందించాలన్నారు. ప్రతి హాస్టల్‌లో రికార్డు మెయింటెనెన్స్ చేయాలన్నారు. వార్డెన్లు, వర్కర్ల నెంబర్లతో పాటు.. జిల్లా అధికారుల ఫోన్ నెంబర్లను హాస్టల్‌లో బోర్డులో అతికించాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ సూపరింటెండెంట్ నాగరత్నమ్మ, ఏబీసీడబ్ల్యూఓలు రంగమ్మ, సుభాషిణి, గంగాద్రి, ఏఎస్‌డబ్ల్యూఓలు దామోదర్‌రెడ్డి, రాధిక, రామ్మోహన్, బీసీ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షల్లో 95 శాతం పాస్

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 3: ఎస్కేయూ బీఈడీ పరీక్షల్లో 95 శాతం మంది పాసయ్యారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత బీఈడీ పరీక్షల ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ 632మంది పరీక్షలు రాయగా 631మంది విద్యార్థులు పాస్ అయ్యారని తెలిపారు. కేవలం ఒక విద్యార్థి మాత్రమే ఫెయిల్ కావడంతో పాస్‌శాతం 95.09గా నమోదైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులు వారి ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ వెంకటనాయుడు, పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ, సీఈ డాక్టర్ లోకేష్, ఏఆర్ శంకర్ పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.24

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.24తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్‌యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్ మంగళవారం 5250 టన్నుల టమోటాలు రాగా కిలో సరాసరి ధర రూ.16, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు తెలిపారు.

మాజీ ఎంపీపీ పీవీ చౌదరికి ఘన నివాళి


పీవీచౌదరి భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

కొత్తచెరువు, సెప్టెంబరు 3: మాజీ ఎంపీపీ పీవీచౌదరి అంత్యక్రియలను మంగళవారం ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, టీడీపీ నాయకులు నిర్వహించారు. రాయదుర్గం, పుట్టపర్తి ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకుడు ఆలం నరసానాయుడులు పీవీ చౌదరి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి పీవీ చౌదరి కృషి చేశారన్నారు. మండల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం ఆయన కుమారులు పీవీ వెంకటేశ్వరప్రసాద్, డాక్టర్ పీవీ రాంప్రసాద్‌ను పరామర్శించారు.


నివాళులు అర్పిస్తున్న రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, రాష్ట్ర నాయకుడు ఆలం నరసానాయుడు

రవీంద్రను అభిమానించే వారంతా మా కుటుంబ సభ్యులే

ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

రామగిరి, సెప్టెంబరు 3: దివంగత పరిటాల రవీంద్రను అభిమానించే ప్రతి ఒక్కరూ మా కుటుంబ సభ్యులే అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురంలో నసనకోట ముత్యాలమ్మకు పరిటాల కుటుంబసభ్యులు మొక్కులు తీర్చుకుని మంగళవారం విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పరిటాల అభిమానులు కూడా వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిటాల పేరుమీద ఏ కార్యక్రమం తలపెట్టినా జిల్లానుంచే కాక రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులు వేలాదిగా తరలిరావడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. అంతకు ముందు పరిటాల రవీంద్ర ఘాట్‌కు నివాళులర్పించారు. విందుకు హాజరైన వారిలో ఎంపీలు బీకేపార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి ప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, బండారు శ్రావణి, ఎంఎస్‌రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టీడీపీ శ్రీసత్యసాయిజిల్లా అధ్యక్షుడు వడ్డే అంజనప్ప, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, అనంతపురం జిల్లా జనసేన అధ్యక్షుడు టీసీవరుణ్, నాయకులు భవానీ రవికుమార్, బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మాజీ మేయర్ స్వరూప, కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి వెంకటరమణప్ప, పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ తదితర ప్రముఖులు ఉన్నారు.


భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత


విందుకు హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు

బాధితుల కోసం రంగంలోకి సీఎం

అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



ఆదిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డికి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 3: వరదబాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు అందించేందుకు సీఎం చంద్రబాబునాయుడు రంగంలోకి దిగారని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. నగరానికి చెందిన ఆదిరెడ్డి వేణుగోపాల్‌కు రూ. 10 లక్షలు, వెంకటలక్ష్మీకు రూ. 2.17 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. మంజూరు పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరదప్రాంతాల్లో వేగంగా సహాయకచర్యలు జరుగుతున్నాయన్నారు. జగన్‌లాగ హెలికాప్టర్‌లో వచ్చి వెళ్లే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయల్ మురళీ, గంగారామ్, కూచి హరి, గుర్రం నాగభూషణం, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఐటీడీపీ అనంతపురం నగర ప్రధాన కార్యదర్శి మంజునాథ్ తల్లి సరస్వతి అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం బాధితురాలి ఇంటికి వెళ్లి ఆర్థికసాయం అందజేశారు.

జేవీవీ సభలను జయప్రదం చేయండి

రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్



మహాసభల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 3: జిల్లాకేంద్రంలోని జీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 14, 15వ తేదీల్లో నిర్వహించనున్న జేవీవీ వార్షిక మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పిలుపునిచ్చారు. మంగళవారం జేవీవీ జిల్లా కార్యాలయంలో మహాసభల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ 14వ తేదీన ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ మాజీ అధ్యక్షుడు, శాస్త్రవేత్త చటర్జీ ముఖ్యఅతిథిగా హాజరై మహాసభలను ప్రారంభిస్తారన్నారు. అదేరోజు శాస్త్రీయ దృక్పథం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై ప్రారంభోపన్యాసం చేస్తారని తెలిపారు. 15వ తేదీన 'రాష్ట్రఅభివృద్ధి- ప్రతిపాదనలు' అంశంపై సదస్సు, 'శాస్త్ర ప్రచారంలో యువతరం, మహిళల పాత్ర'పై ప్రత్యేక సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. మహాసభలకు 26 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు సాకే భాస్కర్, నగర అధ్యక్షకార్యదర్శులు రామిరెడ్డి, వీర్రాజు, నాయకులు నారాయణప్ప, ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

అనంతపురం విద్య, సెప్టెంబరు 3: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని ఈనెల 6న నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పాతూరులో నగర కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ పెరిగిన ధరల వల్ల దేశవ్యాప్తంగా సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బియ్యం, చింతపండు, పప్పులు, కూరగాయలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు సైతం మోదీ ప్రభుత్వంలో భారీగా పెరిగాయని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితులు వచ్చాయన్నారు. ఇప్పటికైనా ధరలను తగ్గించాలని కోరారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాకు అన్ని వర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రమణ, అల్లీపీరా, సంతోష్ కుమార్, గాదిలింగప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఘనంగా బీకే జన్మదిన వేడుకలు



బీకేకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోతులయ్య, విశాలాక్షి వడ్డే వెంకట్ తదితరులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 3: హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అనంతపురంలోని ఆయన గృహంలో కుమ్మర శాలివాహన సమితి రాష్ట్ర కన్వీనర్ మదనాపు పోతులయ్య, రాష్ట్ర గాండ్ల కమ్యూనిటీ కన్వీనర్ గాండ్ల విశాలాక్షి, వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ తదితరులు బీకే పార్థసారథిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

సమస్యల గురుకులం..!

- గార్లదిన్నె మైనార్టీ గురుకుల పాఠశాలలో సమస్యల తిష్ట
- పగలు తరగతి గదులు.. రాత్రి పడక గదులు
- ఆరు బయటే స్నానాలు.. భోజనాలు
- వర్షం వస్తే తడవాల్సిందే..
- కన్నెత్తి చూడని పాలకులు, అధికార యంత్రాంగం
- ఇబ్బందుల్లో విద్యార్థులు



తరగతి గదిలోనే నిద్రిస్తున్న విద్యార్థులు



మైనార్టీ గురుకుల పాఠశాల భవనం

గార్లదిన్నె, సెప్టెంబరు 3: గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తారు. అలాంటి పాఠశాలల్లో తమ పిల్లలు చదివితే ప్రయోజకులవుతారని ఆశలు పెట్టుకుంటారు. గురుకులంలో అడ్మిషన్ లభిస్తే తమ బిడ్డ భవిష్యత్తు బాగుంటుందని తల్లిదండ్రులు కళలు కంటారు. అందుకే గురుకులం పాఠశాలలో చదివించేందుకు పిల్లలను తల్లిదండ్రులు చేరుస్తున్నారు. అయితే గార్లదిన్నెలోని మైనార్టీ గురుకుల పాఠశాల ఇందుకు భిన్నంగా మారింది. ఆ పాఠశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవు. అనంతపురం నగరం మూడో రోడ్డులోని అద్దె భవనంలో నిర్వహిస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలలో సరైన సదుపాయాలు లేకపోవడంతో గార్లదిన్నె ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం నిర్మించిన భవనంలోకి 2016 సంవత్సరంలో మార్చారు.

తరగతి గదులే.. పడక గదులుగా...

మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటంతో సదరు భవనం విద్యార్థులకు ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు గురుకుల పాఠశాలలో దాదాపు 450 చదువుతున్నారు. 450 మంది విద్యార్థులకు కేవలం 12 గదులు మాత్రమే ఉన్నాయి. అవి కూడా తక్కువ విస్తీర్ణంతో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పగలు తరగతి గదులుగా రాత్రి పడక గదులుగా వినియోగించుకోవాల్సిన దుస్థితి విద్యార్థులకు ఎదురవుతోంది. విద్యార్థుల సామగ్రి సైతం ఆ గదులలోనే ఉంచుకోవాల్సి వస్తోంది. ఒక్కో గదిలో దాదాపు 70 నుంచి 80 మంది విద్యార్థులు ఉండాల్సి వస్తోంది. అలాగే కాలకృత్యాలకు విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా మరుగుదొడ్లు లేవు. ఉన్న వాటిలో సగం శాతం వాటికి తలుపులు లేవు.

ఆరు బయటే స్నానాలు

గురుకుల పాఠశాలలో స్నానపు గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేయాల్సి వస్తోంది. భోజనం చేసేందుకు సరైన గది, వంట గదులు సరిగా లేవు. దీంతో భోజనాలు సైతం ఆరుబయటే చేయాల్సిన పరిస్థితి నెలకొంది. భోజనం చేసే సమయంలో వర్షం వస్తే వానలో తడుస్తూ భోజనం చేయాల్సిందే. అయినప్పటికీ అసౌకర్యాలతోనే మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు బస చేయాల్సి వస్తోంది. పలుమార్లు గురుకుల పాఠశాల పర్యవేక్షణకు వచ్చిన అధికారులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ గోడు వెల్లబోసుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది.

ప్రతిపాదనలకే పరిమితం

మైనార్టీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఉపాధ్యాయులతోపాటు మైనార్టీ సంఘం నాయకులు ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినట్లు సమాచారం. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా ఇప్పటి దాకా ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు.

పట్టించుకోని పాలకులు, అధికారులు

మైనార్టీ గురుకుల పాఠశాలను పలుమార్లు అధికారులు, పాలకులు సందర్శించడమే తప్ప సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. పాఠశాలను సందర్శించిన ప్రతిసారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్భాటంగా ప్రకటించడం తప్ప గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో చేసిందేమీ లేదన్న వాదనలున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా తమ పిల్లలకు మెరుగైన వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా భవనం లేకపోవడం వాస్తవమే. భవనంలో 12 గదులు మాత్రమే ఉన్నాయి. గదులు విద్యార్థులకు ఏ మాత్రం సరిపోవడం లేదు. గదుల కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పరిష్కరిస్తామని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.

- అంజనేయులునాయక్, ప్రిన్సిపాల్, మైనార్టీ గురుకుల పాఠశాల, గార్లదిన్నె

వినాయక చవితి మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం

డీఎస్పీ టీవీవీ ప్రతాప్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 3: రాష్ట్ర ప్రభుత్వం వినాయక చవితి పందిళ్ల ఏర్పాటుకు సింగిల్ విండో క్లియరెన్స్ విధానం రూపకల్పన చేసిందని అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్ తెలిపారు. అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోలీస్, అగ్నిమాపక, పురపాలక, విద్యుత్‌శాఖల నుంచి ఏకకాలంలో అనుమతి ఇవ్వడమే సింగిల్ విండో విధానం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యనిర్వాహకులు 7995095800 మొబైల్ నెంబర్‌కు వాట్సాప్ ద్వారా హెచ్ఐ(హాయ్)అని సందేశం పంపిస్తే, విధి విధానాలు రిప్లై వస్తుందన్నారు. గణేష్‌ఉత్సవ్.నెట్ వెబ్సైట్‌లో వివరాలు నింపి సబ్‌మిట్ చేయాలని సూచించారు. అనంతరం గణేష్ మంటపం ఏర్పాటు చేయదలచిన కమిటీ సభ్యుల వివరాలు, మంటపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది, ప్రతిష్ట, నిమజ్జనం వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తు సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు వెళ్తుందన్నారు. అధికారులు పరిశీలించి అనుమతికి అవసరమైన రుసుం వివరాలు తెలియజేస్తారని వివరించారు. మీ సేవ కేంద్రంలో రుసుం చెల్లించిన అనంతరం ఎన్‌ఓసీ జారీ చేస్తారన్నారు. ఆ పత్రాన్ని ప్రింట్ తీసి గణేష్ మండపంలో ఉంచాలన్నారు.

రైతులకు రుణాలు మంజూరు చేయండి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

గార్లదిన్నె, సెప్టెంబరు 3: బ్యాంకుల్లో ఓటీఎస్ చేసిన రైతులకు రుణాలు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కల్లూరు స్టేట్‌బ్యాంకు ముందు మంగళవారం రైతురైతుసంఘం నాయకులు ధర్నాచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులు చెప్పిన వారికే రుణాలు మంజూరు చేయడం ఏంటని ప్రశ్నించారు. అదేవిధంగా పాడి రైతులకు డైయిరీ లోన్లు ఇవ్వాలన్నారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని బ్యాంకు మేనేజర్ రామాంజినేయులు బాబు హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. ధర్నాలో సీపీఎం మండల అధ్యక్షుడు చెన్నారెడ్డి, జయరాముడు, ఓబిలేసు, ఓబన్న పాల్గొన్నారు.

'సమస్యలను వెంటనే పరిష్కరించండి'

గార్లదిన్నె, సెప్టెంబరు 3: సత్యసాయి తాగునీటి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీ జగ్గాలరవి, ఎంపీటీసీ నాగరత్నమ్మ డిమాండ్ చేశారు. సత్యసాయి తాగునీటి కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 13వ రోజుకు చేరుకుంది. సమ్మెకు వారు మద్దతునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు అందలేదన్నారు. వెంటనే వేతనాలు చెల్లించి ఈఎస్ఐ, ఈపీఎఫ్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో తాగునీటి కార్మికులు నాగభూషణం, నారపరెడ్డి, బృందావన్ రామాంజి, మల్లరాయుడు, శ్రీనివాసులు, సాంబ శివ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నార్పల: పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ బీ పప్పూరు పంప్ హౌస్ వద్ద సత్యసాయి కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 13వ రోజుకు చేరింది. కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. నిరసనలో కార్మికులు నాగభూషణ, అంకన్న, పుల్లానాయుడు, శరత్‌బాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రకృతి రుణం తీర్చుకోవాలంటే మొక్కలు నాటండి

గుంటూరు ఏఎస్పీ హనుమంతు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 3: ప్రకృతి రుణం తీర్చుకోవాలంటే మొక్కలు నాటాలని గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ హనుమంతు పిలుపునిచ్చారు. మంగళవారం గుత్తిరోడ్డులోని నర్సరీ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పద్యగాయకుడు అహ్మద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చెట్లు చెడుగాలిని స్వీకరించి ప్రాణవాయువును ఎలా విడుదల చేస్తుందో అదేవిధంగా మనుషులు చెడు ఆలోచనలు మాని జ్ఞానం వైపు మరలాలన్నారు. మానవ తప్పిదాలవల్ల భూతాపం పెరిగి ప్రకృతి ప్రళయంగా మారుతోందన్నారు. భావితరాలవారికి మంచి వాతావరణం అందించాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి, భాస్కర్‌నాయుడు, రమణమూర్తి, హరి, డిస్కవరి అనీల్‌కుమార్, జైకిసాన్ ఓబులేసు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 3: నగర విద్యార్థులు అనంతకీర్తిని జాతీయస్థాయిలో చాటారు. ఆర్యన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న అఖిలేష్, కల్యాణ్, ఈశ్వరసింహ ఇటీవల అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన జాతీయస్థాయి టార్గెట్‌బాల్ పోటీల్లో ద్వితీయస్థానంలో గెలుపొందారు. ఈ సందర్భంగా మంగళవారం వారిని పాఠశాల డైరెక్టర్ సందీప్, ప్రిన్సిపాల్ లహరి అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు హుసేన్ పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు: కలెక్టర్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్ సెప్టెంబరు 3: కళ్లను దానం చేస్తే ఇద్దరికి కంటిచూపు వస్తుందని, వారి జీవితాల్లో వెలుగు నిండుతుందని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ నుంచి క్లాక్ టవర్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకూ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నిదానాలలో నేత్రదానం చాలా గొప్పదని అన్నారు. మరణాంతరం ఆరు గంటలలోపు కళ్లను దానం చేస్తే చూపులేని ఇద్దరికి అమర్చి, వారికి కంటిచూపు ఇవ్వడానికి వీలవుతుందని అన్నారు. తన కుటుంబం మొత్తం నేత్రదానం చేస్తున్నామని కలెక్టర్ ప్రకటించి, ఆమోదించారు. నేత్రదానానికి సంబంధించిన పత్రాలను పూరించి అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ లక్ష్మణప్రసాద్, అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సైదన్న తదితరులు పాల్గొన్నారు.

కులంపేరుతో దూషించారని ఫిర్యాదు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 3: తమను కులంపేరుతో దూషించి దాడికి పాల్పడ్డారని మండలంలోని బసంపల్లి ఎస్సీ(మాల)కాలనీకి చెందిన పలువురు మంగళవారం పోలీసులు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్మశానవాటిక సమస్య గురించి స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. ఈ నేపథ్యంలో ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్, వీఆర్వో, మండల సర్వేయర్ మంగళవారం గ్రామానికి వచ్చి స్థలాన్ని పరిశీలిస్తుండగా తాము అక్కడకు వెళ్లడం జరిగిందన్నారు. అయితే అప్పటికే అక్కడకు చేరుకున్న శంకరనారాయణ, ఆనంద్, వెంకటలక్ష్మమ్మ, వరలక్ష్మీ వచ్చి స్థలం జోలికి వస్తే నరుకుతామని తమను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. కులంపేరుతో దూషించి దాడికి పాల్పడ్డారన్నారు. వారితో తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు.

ఎస్కేయూ పాలనా విభాగాల్లో బదిలీలు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 3: ఎస్కేయూ పరిపాలనా విభాగాల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగుల బదిలీలకు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత ఆదేశాలు జారీచేశారు. మంగళవారం రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు ఉత్తర్వులు జేశారు. ముగ్గురు డిప్యూటీ రిజిస్ట్రార్ (డీఆర్)లు, ఇద్దరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ (ఏఆర్)లు, 11 మంది సూపరింటెండెంట్‌లు, ఒకరు సీనియర్, ఒకరు జూనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు.

బాధితులకు పరామర్శ



డాక్టర్లకు సూచనలుచేస్తున్న సింధూర, పల్లె

అనంతపురం టౌన్, సెప్టెంబరు 3: ప్రమాద బాధితులను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి రఘునాథరెడ్డి పరామర్శించారు. నల్లమాడ మండలం బోగ్గిటివారిపల్లికి చెందిన రైతులు లక్ష్మీదేవి, రమాదేవి, చంద్రమోహన్ టమోటా తీసుకెళుతుండగా సోమవారం ప్రమాదానికి గురయ్యారు. వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో బాధితులను పరామర్శించేందుకు మంగళవారం ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి రఘునాథరెడ్డి జిల్లా ఆసుపత్రికి వచ్చారు. వారిని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు సూచించారు.

అనుమతి తప్పనిసరి: ఎంపీడీఓ

శింగనమల, సెప్టెంబరు 3: వినాయకచవితిని పురస్కరించుకుని మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపీడీఓ నిర్మలాకుమారి సూచించారు. మంగళవారం మండపాల ఏర్పాటుపై వినాయక కమిటీ సభ్యులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు పోలీసులు, రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ రావు, వీఆర్ఓ ఎర్రితాతయ్య, పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 3: వినాయక చవితిని పురస్కరించుకుని బుధవారం ఉదయం 10.30 గంటలకు శ్రీనివాసనగర్ రామాలయం వద్ద మట్టి వినాయక ప్రతిమలు, మొక్కలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధ్యతల స్వీకరణ

అనంతపురం టౌన్, సెప్టెంబరు 3: జిల్లా సర్వజన ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కల్లేటి నాగమణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

విజయవాడకు టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 3: విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో వరద సహాయక చర్యలు చేపట్టేందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు మంగళవారం బయలుదేరి వెళ్లారు. వైకుంఠం ప్రభాకర్‌చౌదరితోపాటు నాయకులు దేవళ్ల మురళీ, మారుతీకుమార్ గౌడ్, నటేష్ చౌదరి, గోపాల్ గౌడ్, రామాంజినేయులు, శేఖర్, రవి చౌదరి, సున్నం శ్రీనివాసులు, మహేష్ తదితరులు విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

ద్విచక్రవాహనం బోల్తా.. వ్యక్తి మృతి

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 3: ద్విచక్రవాహనం బోల్తాపడి రమణారెడ్డి(37) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రమణారెడ్డి పనినిమిత్తం ద్విచక్రవాహనంలో ఎన్ఎస్‌గేటుకు బయలుదేరాడు. బసినేపల్లి, నాగసముద్రం గ్రామాల మధ్య అదుపు తప్పి ద్విచక్ర వాహనం బోల్తాపడింది. తలకు బలమైన గాయం కావడంతో చికిత్సనిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. తండ్రి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : సీఐ

శింగనమల, సెప్టెంబరు 3: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. ప్యాళ్లన్ గ్రామం సీ బండమీదపల్లిలో మంగళవారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ గ్రామస్థులను హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ సాగర్ ఉన్నారు.

గార్లదిన్నె: మండలంలోని మర్తాడు గ్రామంలో సీఐ కౌకుంట్లయ్య మంగళవారం రాత్రి ఎస్ఐ గౌస్‌బాషాతో కలిసి పర్యటించారు. గ్రామస్థులతో శాంతిభద్రతలపై ఆరా తీశారు. వినాయక చవితి సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రూ.1.60 లక్షలకు బురిడీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 3: ఫర్నిచర్ తక్కువ ధరకే ఇస్తానని నమ్మించి ఓ నేరగాడు బురిడీ కొట్టించాడు. తాను ఆర్మీ జవాన్ అని, మరో ప్రాంతానికి బదిలీ అయ్యానని, అంతదూరం ఫర్నీచర్ తీసుకెళ్లలేనని, తక్కువ ధరకు ఇస్తానని ఫేస్‌బుక్‌లో పెట్టాడు. నగరానికి చెందిన జగన్ అతడికి కాల్ చేశాడు. అతను చెప్పినట్లుగా రూ.1.60లక్షలు పంపాడు. అతని నుంచి ఎలాంటి సమాధారం రాకపోగా ఫోన్ పనిచేయలేదు. మోసపోయానని గ్రహించిన జగన్ మంగళవారం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సైబర్ క్రైం కింద కేసు నమోదు చేశారు.

నేడు అంబేడ్కర్ గురుకులాల ప్రవేశ పరీక్ష

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 3: జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాల్లో ఆరు నుంచి 8వ తరగతి వరకూ కేటాయించిన అదనపు సీట్లకు బుధవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు గురుకులాల ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర 41 అదనపు సీట్లకు 558 దరఖాస్తులు, బాలికల 62 సీట్లకు 644 దరఖాస్తులు వచ్చాయన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందు అంటే 10 గంటలకే చేరుకోవాల న్నారు. ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు.

నియామకం

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 3: ఎస్కేయూ సెంట్రల్ కంప్యూటర్ ల్యాబ్ కో-ఆర్డినేటర్‌గా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర నియమితులయ్యారు. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత ఆదేశాలమేరకు మంగళవారం రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు పలువురికి నూతన బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ గీతాంజలి సెంట్రల్ స్టోర్ విభాగాధిపతిగా, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ జెస్సీ ఉమెన్స్ హాస్టల్స్ అడిషినల్ వార్డెన్‌గా బాధ్యతలు అప్పగించారు.

పౌష్టికాహారం తీసుకోండి

ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

శింగనమల, సెప్టెంబరు 3: రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సూచించారు. మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం శింగనమల కేజీబీవీ, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ గీతావాణి, నర్సరీ అధికారి సుధా, సూపర్‌వైజర్లు ధనలక్ష్మీ, కౌసల్య ఉమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, ప్రమీలా, రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: పౌష్టికాహారంతో ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యూన్సీ రాణి అన్నారు. మంగళవారం మండలంలోని రుద్రంపేట-1 అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు రక్తహీనతపై ఆమె అవగాహన కల్పించారు. హిమోగ్లోబిన్ వృద్ధికి ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, బెల్లం, ఎండు ఖర్జూరాలు తీసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశావర్కర్ నాగసుబ్బమ్మ, శైలజ, భార్గవి, ఆశావర్కర్ చంద్రకళ పాల్గొన్నారు. అదేవిధంగా కురుగుంటలో మాసోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతి, ఏఎన్ఎం సుధ, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

పరిటాల రవీంద్రకు ఘననివాళి



నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి, సెప్టెంబరు 3: మండలంలోని వెంకటాపురం గ్రామంలో పరిటాల రవీంద్రకు టీడీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం నసనకోట ముత్యాలమ్మ దేవాలయం వద్ద ఎమ్మెల్యే పరిటాలసునీత ఆధ్వర్యంలో జరిగిన విందుకు నంటూరి వెంకటరమణ, నంటూరి రంగనాయకులు, హరి, పాముళ్ల నారాయణస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పరిటాల రవి ఘాట్‌కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎఫ్‌పీ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 3: ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అధికారులు ఎఫ్‌పీ షాపుల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఓడీచెరువు మండలం ఎద్దులపల్లి గ్రామంలోని డీలర్ గంగాద్రికి చెందిన ఎఫ్‌పీ షాపులో తనిఖీలు చేశారు. హిందూపురం మండలం కొటిపి గ్రామంలోని డీలర్ అంబికకు చెందిన ఎఫ్‌పీ షాపును పరిశీలించారు. ఈ రెండు షాపుల్లోనూ రికార్డులకు భౌతిక నిల్వలను పరిశీలిస్తే ఉండాల్సిన వాటి కంటే అదనంగా ఉన్నట్లు తేల్చారు. అదనంగా ఉన్న నిల్వలుమనన జప్తు చేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో సీఐ జమాల్ బాషా, ఎస్ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఏఓ వాసుప్రకాష్, ఏజీ శివప్రసాద్, వీర్వోలు లక్ష్మీనరసప్ప, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

నగరవనాన్ని పరిశీలించిన ట్రైనీ రేంజర్లు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 3

నగరవనంను మహారాష్ట్ర ట్రైనీ రేంజర్లు 40 మంది మంగళవారం సాయంత్రం వచ్చారు. నగరవనంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా రేంజర్ శ్రీనివాసులు వారికి వివరించారు. బుధవారం ఉదయం బృందం తిమ్మమ్మ మర్రిమాను సందర్శిస్తుందన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు బీట్ ఆఫీసర్స్ నీలవేణి, జగదీశ్, తేజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్, ఏబీఓ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో మారెమ్మ దేవత

ఉరవకొండ, సెప్టెంబరు 3: పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం సమీపంలో వెలసిన గౌరసంద్రం మారెమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వివిధ అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశా రు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి : ఏఓ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 3: ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి కే స్వాతి పేర్కొన్నారు. స్థానిక శ్రీ లక్ష్మీవెంకటేశ్వర, వరసిద్దేశ్వర, శ్రీరంగా, పద్మావతి, మారుతి ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవా రం ఏఓ ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణాల లైసెన్స్‌లు, మందుల బిల్లులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. వరసిద్దేశ్వర దుకాణంలో రికార్డులు సరిగా లేనం దున రూ.35,200 స్టాప్ సేల్ ఇచ్చామని ఏఓ తెలిపారు.

రాయితీతో ప్రత్యామ్నాయ విత్తనాలు

పామిడి, సెప్టెంబరు 3 : ఖరీఫ్‌లో ఇంతవరకూ పంటలు సాగుచేయని మండలంలోని రైతులు కోసం రాష్ట్ర ప్రభుత్వం 80శాతం రాయితీతో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి లీనావసుంధర పేర్కొన్నారు. ఉలువలు, కొర్ర, జొన్న విత్తనాలు అందజేస్తామన్నారు. కావాల్సిన రైతులు రైతు సేవాకేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు.

ఐసీడీఎస్ సీడీపీఓగా పద్మావతి

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 3: స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓగా పద్మావతిని నియమిస్తూ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాయదుర్గం సీడీపీఓ ప్రభావతమ్మ ఇటీవలే రిటైర్ అయ్యారు. ఆ స్థానంలోకి శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ ప్రాజెక్టు సీడీపీఓగా విధులు నిర్వహిసు న్న ఏఎల్ పద్మావతిని బదిలీ చేశారు. ఆమె గురువారం రాయదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

డీ హీరేహాళ్, సెప్టెంబరు 3: మండలంలోని మురడి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పెద్దమడి వెంకటరెడ్డి సతీమణి పెద్దమడి అంజినమ్మ(60) అనారోగ్యంతో సోమవా రం మరణించింది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మంగళవారం ఉదయం మురడికి వెళ్లి అంజినమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

బొమ్మనహాళ్, సెప్టెంబరు 3: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం లోని బొమ్మదేవరపల్లికి చెందిన శీనప్ప అనే వ్యక్తి బొమ్మనహాళ్ మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆయా గ్రామల్లో నిల్వ చేశాడు. ఆ బియ్యాన్ని మంగళవారం ఆటోలో బళ్లారికి తరలిస్తుండగా ఉంతకల్లు క్రాస్ వద్ద పట్టుకున్నారు. ఆటోలో ఉన్న 25 సంచుల(50 కేజీల ప్యాకెట్లు) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. శీనప్పను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

తాడిపత్రి, సెప్టెంబరు3: మండలంలోని బొందలదిన్నె గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌పై అదనపు కట్నం కేసు నమోదుచేసినట్లు మంగళవారం రూరల్ ఎస్ఐ కాటయ్య తెలిపారు. పెద్దపప్పూరు మండలం జూటూరుకు చెందిన లక్ష్మీదేవితో 2013లో చంద్రశేఖర్‌కు వివాహమైంది. అప్పట్లో కట్నకానుకలు ఇచ్చి పెళ్లి చేశారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొద్దిరోజుల నుంచి చంద్రశేఖర్ అదనపు కట్నం తేవాలని లక్ష్మీదేవిని చిత్రహింసలు గురిచేసేవాడు. దీంతో వేధింపులను భరించలేక లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఆమె ఫిర్యాదుమేరకు భర్త చంద్రశేఖర్‌పై కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాడిపత్రి, సెప్టెంబరు3: మండలంలోని చిన్నపొలమడ గ్రామంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం సీజ్‌చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ రాజశేఖర్‌పై కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పామిడి, సెప్టెంబరు 3 : పట్టణంలోని వై జంక్షన్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు ఓబులేసు తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని పామిడమ్మ వీధికి చెందిన బోయ ఓబులేసు గుత్తి నుంచి పామిడికి ద్విచక్రవాహనంలో వస్తున్నాడు. అనంతపురం నుంచి గుత్తి వైపు వెళ్తున్న కంటైనర్‌ను తప్పించబోయి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గాయపడిన ఓబులేశును 108 వాహనంలో పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్)

కర్నూలు/యాడికి, సెప్టెంబరు 3: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవనగర్‌లో వెంకటేశ్ (23) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన తిరుపాలుకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వెంకటేష్ డిప్లొమా చదివాడు. అయితే కొన్ని సబ్జెక్ట్‌లు తప్పాడు. ఏడాది కింద కర్నూలు వచ్చి దేవనగర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివాసముంటున్నాడు. ఆర్ఆర్‌బీ పరీక్షలకు సిద్ధమవుతూ.. వాహనాలకు జీపీఎస్ సిస్టమ్ అమర్చే పని చేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీ తల్లిదండ్రులతో మాట్లాడిన వెంకటేశ్ 2వ తేదీ నుంచి ఫోన్ లిఫ్టు చేయడం లేదు. దీంతో తల్లిదండ్రులు కర్నూలులోని బంధువులకు సమాచారం ఇవ్వగా.. వారు వెంకటేశ్ గదికి వెళ్లి పరిశీలించారు. గదిలో వెంకటేష్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే తలుపులు పగు లకొట్టి వెంకటేశ్‌ను కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళిధర్ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని మంగళవారం రాయలచెరువుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. వెంకటేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.





బెళుగుప్పలో ప్రత్యేక అలంకరణలో మారెమ్మ దేవత, అమ్మవారికి ఒడిబియ్యం తీసుకెళుతున్న భక్తులు



గౌరసముద్రంలోని మారెమ్మ దేవత

ఘనంగా మారెమ్మ ఉత్సవాలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

గుమ్మఘట్ట మండల సరిహద్దులో కర్ణాటక ప్రాంతంలోని గౌరసముద్రం అడవి ప్రాంతంలో వెలసిన మారెమ్మ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది మంది హాజరై మొక్కులు తీర్చుకుంటారు. ఒక్క రోజు మధ్యాహ్నం జరిగే ఉత్సవాలకు అనాది చరిత్ర ఉంది. సాయంత్రానికి ఈ జాతరలో ఒక్కరూ ఉండరు. తిరిగి తమ గ్రామాలకు చేరుకుంటున్నారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ దేవత మారెమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా గౌర సముద్రం మారెమ్మ ఉత్సవాలను రాయదుర్గం రూరల్, బెళుగుప్ప, కుందుర్పి మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్త మండలి ఆధ్వర్యం లో విశేషపూజా కార్యక్రమాలు జరిపారు. ధ్వజారోహణ, అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చన అమ్మవారికి వడిబియ్యం సమర్పణ, ప్రత్యేకాలంకరణ పురవీధుల గుండా అమ్మవారి ప్రభ ఊరేగింపు సామూహిక కుంకుమార్చన, మహామంగళహారతి, తీర్థ ప్రసాదాల వినియోగం, అన్నప్రసాద వితరణతో పూజలు ముగిశాయి. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కుందుర్పిలో బోనాలను తీసుకెళుతున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో దుగ్గిలమ్మ జాతర



అలంకరణలో దుగ్గిలమ్మ



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 3: పట్టణంలోని మధు థియేటర్ వెనుకనున్న ఆలయంలో దుగ్గిలమ్మ దేవత జాతరను మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ఉదయాన్నే పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వెండి కవచధారణ చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి వేపాకు, చీర, ముడుపులు చెల్లించారు. అనంతరం బలిదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రావణమాసం ముగిసిన మొదటి మంగళవారం జాతర నిర్వహిస్తారు. పట్టణ, గ్రామ ప్రాంతాల నుంచి వేలాదిమందిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి : సీపీఐ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 3: పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బీ గోవిందు, మండల కార్యదర్శి రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. .పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నాయని మండిపడ్డారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, నాయకులు మహేష్, రామాంజినేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ఆనంద్‌బాబు ఆచారికి వినతిపత్రం అందజేశారు. వారిలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకటరాముడుయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రఫీ తదితరులు ఉన్నారు.

జాతీయ లోక్ ఆదాలత్‌ను విజయవంతం చేయండి

గుత్తి, సెప్టెంబరు3: స్థానిక కోర్టు ఆవరణలో ఈనెల 14న జరగనున్న జాతీయ లోక్ ఆదాలత్‌ను విజయవంతం చేయాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ఆరో అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి ఎం శ్రీహరి తెలిపారు. ఏఈజే ఎం శ్రీహరి మంగళవారం స్థానిక సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం కాశీవిశ్వనాథాచారి, జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయాధికారి బీ శ్వేతతో కలిసి స్థానిక ఏడీజే కోర్టులో అధికారులతో సమావేశం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామశర్మ, ఉపాధ్యక్షుడు వీడీ రత్నం, సీఐ వెంకటేశ్వర్లు, సెబ్ సీఐ సునీల్, పెద్దవడుగూరు సీఐ చిన్నరెడ్డప్ప, న్యాయవాదులు ఫక్రుబాష, ధనుంజయ, సూర్యనారాయణ, గంగాధర్‌కుమార్, శ్రీధర్, సతీష్, చలపతి, విజయ్‌భాస్కర్, బ్యాంక్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

పామిడి, సెప్టెంబరు 3 : మండలంలోని దిబ్బసానిపల్లి గ్రామంలో ఎన్‌ఎంపీ తండా గ్రామానికి వెళ్లే రోడ్డుకు టీడీపీ మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దిబ్బసానిపల్లి చెక్‌డ్యాం నిండి పొంగి పొర్లడంతో రోడ్డు కోతకు గురైంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారడంతో టీడీపీ నాయకుడు ఆర్‌ఆర్ రమేష్ గుమ్మనూరు ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లి ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతు పనులు చేయించారు.

గేట్స్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



ఎంపికలో పాల్గొన విద్యార్థులు

గుత్తి, సెప్టెంబరు 3: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవళి ప్రధా నంగా ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాల గురించి భారత ప్రభుత్వం ప్రారంభించిన దేశంలోనే అతి పెద్ద హ్యాకథాన్ వేదికను ఏర్పాటు చేయనుందన్నారు. ఇందులో కళాశాల విద్యార్థులు పాల్గొని తమ ఆలోచనలను ఈనెల 12లోపు సమర్పించాలన్నారు. ఇందుకోసం 25టీంలను స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వెబ్‌సైట్‌లో పొందపరచామన్నారు. ఈ మేరకు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌డీ కో-ఆర్డినేటర్ ఖయ్యూమ్, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాష, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

కుందుర్పి, సెప్టెంబరు 3 : కుందుర్పి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో గణిత శాస్త్రం బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు ఎవరైనా పోస్ట్ గ్రాడ్యుయేట్ పొంది ఉన్న అర్హులన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో గురువారం కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

● ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఉరవకొండ, సెప్టెంబరు 3: కళ్యాణదుర్గంలో ఈ నెల 19, 20వ తేదీలలో నిర్వహించే ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు చంద్ర, హారున్ రషీద్ కోరారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వ బడ్జెట్‌లో విద్యారంగానికి 10శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలన్నారు. జిల్లాలో సెంట్రల్ యూనివర్సిటీ, ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా జీఓ నం. 77ను రద్దు చేయాలన్నా రు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు.

త్వరితగతిన పనులు పూర్తిచేయండి

● డీఎంహెచ్ఓ ఆదేశం

పెద్దవడుగూరు, సెప్టెంబరు3: మండలకేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని జిల్లా వైద్యశాఖ అధికారి భ్రమరాంబికాదేవి పరిశీలించారు. భవనంలో అసంపూర్తిగా ఉన్న చిన్నపాటి పనులను త్వరితగతిన పూర్తి చేసి వారంరోజుల్లో భవనంలో వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే ప్రస్తుతం తీవ్రవర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో ప్రజలు రోగాలబారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు . ప్రజలకు అందుబాటులో ఉండాలని వారికి సూచించారు.

'జ్వర పీడితుల గుర్తింపులో నిర్లక్ష్యం వద్దు'

యాడికి, సెప్టెంబరు 3: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో జ్వరపీడితులను గుర్తించడంలో ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని యాడికి ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు శ్రీరామ్‌కుమార్ తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది జ్వర బాధితులను గుర్తించి ప్రతిరోజూ రక్తపరీక్షలు చేయాలని తెలిపారు. యాడికిలోని ప్రభుత్వ వైద్యశాలలో ఆరోగ్య సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడా రు. సమావేశంలో వైద్యులు పరమేశ్వర్, మలేరియా నివారణ తాడిపత్రి సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది జుబేదా, వెంకటలక్ష్మి, సరిత, రాంప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ పంపిణీ

గుత్తి, సెప్టెంబరు3: బెంగళూరు, తదితర ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు పింఛన్ లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్ అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మీయా తెలిపారు. కమిషనర్ సూచనల మేరకు... పట్టణంలోని నేసేవీధికి చెందిన వెంకటేశ్వర్లు బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా సచివాల య సిబ్బంది రమేష్ అక్కడికే వెళ్లి పింఛన్ అందజేశాడు. అదే విధంగా కడపలో ఉన్న నాగలక్ష్మమ్మకు, బళ్లారి ఆసుపత్రిలో ఉన్న అలివేలమ్మకు సచివాలయ సిబ్బంది అరుణ్‌కుమార్, వీఆర్వో రంగయ్య అక్కడికే వెళ్లి పింఛన్ అందజేసినట్లు కమిషనర్ తెలిపారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

తాడిపత్రి, సెప్టెంబరు 3: మండలంలోని రావివెంకటాంపల్లి సమీపంలోని సర్ సీవీ రామన్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా జరిగింది. కళాశాల చైర్మన్ బీవీ భాస్కర్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన లక్ష్యాలను నిర్దేశించుకొని, సన్మార్గంలో వాటిని సాకారం చేసుకోవాలని తెలిపారు. ప్రిన్సిపాల్ ఇందూధర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్యసాధనలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొన్నవారే అత్యున్నతస్థానాలను చేరుకుంటారని తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన డ్యాన్స్ ప్రోగ్రాం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆయా విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి

● సమన్వయంతో చర్యలు చేపట్టాలి
● వివిధ శాఖల అధికారులకు ఆర్డీఓల సూచన



కళ్యాణదుర్గంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ తదితరులు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 3 : వినాయకచవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవా లని ఆర్డీఓ రాణిసుస్మిత, డీఎస్పీ రవిబాబు తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఎంపీడీఓలు, సీఐలు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లతో వారు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వినాయక చవితి ఉత్స వాలు ప్రశాంతంగా ముగించేందుకు తీసుకోవాల్సి కట్టుదిట్టమైన చర్యలను క్షుణంగా వారికి వివరించారు. అనంతరం వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి తెలిపే నియమ, నిబంధనల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

గుంతకల్లుటౌన్: వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటు కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాలపై మంగళవారం డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... మండపాల వద్ద, నిమజ్జనం చేసేటప్పుడు నిర్వాహకులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలను కొలువుదీర్చాలన్నారు. అనంతరం వినాయక ఘాట్‌ను పరిశీలించారు. ఈ సమావేశంలో డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, తహసీల్దారు రమాదేవి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి, సీఐలు తదిరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

తాడిపత్రి: వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ శివగంగాధర్‌రెడ్డి హెచ్చరించారు. వినాయక ఉత్సవకమిటీ సభ్యులు, వినాయక మండపాల నిర్వాహకులతో ఆయన మంగళవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సమావేశమయ్యారు. మండపాల వద్ద, నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీఐ వివరించారు.

బొమ్మనహాళ్ : స్థానిక ఎస్ఐ నబీరసూల్ బొమ్మనహాళ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. పలు సూచనలు చేశారు. నాయకులు పయ్యావుల మోహన్ బాబు, ధనుంజయరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే వారు తప్పక అనుమతులు తీసుకోవాలని మంగళవారం ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని, వివరాలకు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే జేసీ



సీఐతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, సెప్టెంబరు 3: ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మంగళవారం పట్టణంలో పర్యటించారు. సీబీరోడ్డు, పోలీస్‌స్టేషన్‌రోడ్డులో ఉన్న పలు దుకాణాల యజమానులు, చిరువ్యాపారులను పలకరిస్తూ వ్యాపారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ సాయిప్రసాద్ ఎమ్మెల్యే వద్దకు వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఈశాన్యభాగాన సెల్‌టవర్ ఉండడంతో వాస్తు సమస్య ఉందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై విచారించి పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట నా యకులు హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, మధు, సోమశేఖర్‌నాయుడు, చిన్న, రంగయ్య, గోవర్ధన్‌రెడ్డి, యుగంధర్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు

గుత్తి రూరల్, సెప్టెంబరు 3: మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలోని పంట పొలాలను మండల వ్యవసాయాధికారి మెహరున్నీసా పరిశీలించారు. 'పంటలకు తెగుళ్ల దాడి' అనే శీర్షిక తో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావాడంతో వ్యవసాయాధికారులు స్పందించారు. వేరుశనగ, పత్తి, ఆముదం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా పంటలకు తెగుళ్ల వ్యాపించాయని తెలిపారు. పత్తి పంటను రసం పీల్చే పురుగు ఆశించిందన్నారు. దాని నివారణకు 100 గ్రాములు అనిటామిప్రిడ్ ను ఎకరానికి పిచికారి చేయాలన్నారు. ఆముదం పంటను నామాల పురుగు, రసం పీల్చే పురుగు ఆశించిందన్నారు. నివారణకు అసిఫేట్, 300 గ్రాములు, క్వినాల్‌ఫాస్ 500 ఏమ్ఎల్ ఎకరానికి పిచికారి చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కృష్ణభగవాన్ రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దర్గాహొన్నూరులో వైద్యశిబిరం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 3: మండలంలోని దర్గాహొన్నూరులో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 'దర్గాహొన్నూరులో విష జ్వరా లు' అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు స్థానిక వైద్యాధికారి రఫీయాసుల్తానా స్పందిం చారు. సిబ్బందితో గ్రామంలోని ఇంటింటికి వెళ్లి విషజ్వరాలపై సర్వే చేయించారు. ఇద్దరి విద్యార్థినులు వైష్ణవి, లక్ష్మితో పాటు వృద్ధురాలు వెంకటలక్ష్మి ఆరోగ్యపరిస్థితిపై విచారణ చేశారు. ప్రస్తుతం వారి పరిస్థితి బాగుందనితెలిపారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశామని వైద్యా.దికారి తెలిపారు. ఎలాంటి విషజ్వరాలు లక్షణాలు కనిపించిన స్థానిక ఆసుపత్రిని సందర్శించా లని ప్రజలకు సూచించారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ లక్ష్మనాయక్, సూపర్‌వైజర్ భారతి, ఆరోగ్య కార్యకర్తలు హేమాంజలి, రాధిక, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిలో అడ్డంకులను తొలగించండి

● ఏడీఆర్ఎంకు టీడీపీ నాయకుల వినతి



ఏడీఆర్ఎంతో సమస్యపై చర్చిస్తున్న టీడీపీ నాయకులు

గుంతకల్లు, సెప్టెంబరు3: పట్టణంలోని రహదారుల నుంచి రైల్వే కాలనీల్లోకి ప్రవేశించకుండా ఏర్పాటుచేసిన అడ్డంకులను తొలగించాలని టీడీపీ నాయకులు ఏడీఆర్ఎం య సుధాకర్‌కు విన్నవించారు. వారు మంగళవారం ఉదయం డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లారు. డీఆర్ఎం లేకపోవడంతో ఏడీఆర్ఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ.... పట్టణంలోని భాగ్యనగర్, మస్తాన్‌పేట, కొత్తకొట్టాల, పోర్టర్స్‌లైన్, విద్యానగర్ కాలనీల రోడ్ల నుంచి రైల్వే క్వార్టర్లు, రైల్వే స్టేషన్ పరిధుల్లోకి ఎవరూ ప్రవేశించకుండా అడ్డుగోడల్ని, ఇనుప కమ్మీలను నాటారన్నారు. దీని వల్ల విద్యార్థులు, చిన్నారులు, పట్టణవాసులు, రైల్వే ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లేలా ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, శివన్న, అంజి, తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

ఉరవకొండ, సెప్టెంబరు3: వేతన బకాయిలను వెంటనే మంజూరు చేయాలని ఆర్ డబ్ల్యూఎస్, సీపీడబ్ల్యూఎస్ స్కీం వర్కర్లు కలెక్టర్‌ను కోరారు. ఆ యూనియన్ నాయకులు మంగళవారం అనంతపురంలోని కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఉరవకొండ తాగునీటి పథకంలో 24సంవత్సరాలుగా పనిచేస్తున్నా మన్నారు. తమకు తొమ్మిది నెలలుగా జీతాలు ఇవ్వలేదని, ఈఎస్ఐ కూడా కట్టలేదన్నారు. యూనియన్ నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున, రామాంజినేయులు, సాదిక్‌వలి, తిప్పయ్య, వన్నూరుస్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ. 3 కోట్లు మంజూరు

బెళుగుప్ప, సెప్టెంబరు 3 : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు మండలానికి రూ. 3కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ద తిప్పయ్య మంగళవారం తెలిపారు. గత ప్రభుత్వం గ్రామాల్లో ఎక్కడా సిమెంటు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోలేదన్నారు. నిధుల మంజూరుకు చొరవచూపిన పయ్యావుల సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నాయకుడి తిరుమల పాదయాత్ర

కణేకల్లు, సెప్టెంబరు 3: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ... తాను గతంలో చేసుకున్న మొక్కును చెల్లించేందుకు ఎంపీటీసీ సభ్యుడు నరేంద్ర మంగళవారం తిరుమలకు పాదయా త్రకు బయలుదేరాడు. టీడీపీ అధికారంలోకి వస్తే తిరుమలకు పాదయాత్రగా వస్తామని మొక్కుకున్నట్లు మండలంలోని హనుమాపురం ఎంపీటీసీ సభ్యుడు నరేంద్ర తెలిపారు.

రేపు ఉపాధ్యాయ దినోత్సవాలు

తాడిపత్రి, సెప్టెంబరు 3: పట్టణంలోని రమణమహర్షి ఆశ్రమంలో గురువారం పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 80సంవత్సరాల్లోకి అడుగుపెట్టనున్న పెన్షనర్లకు ఆశ్రమ నిర్వాహకులు వీవీ బ్రహ్మం సన్మానం చేస్తారని తెలిపారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మీయా

గుత్తి, సెప్టెంబరు3: మట్టి వినాయకుడిని పూజిద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దాం అంటూ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మీయా ఆధ్వర్యంలో పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. రానున్న వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలు, రసాయనాలతో చేసిన వినాయక ప్రతిమలు కాకుండా మట్టి వినాయకులను మాత్రమే పూజించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ క్లర్క్ ఇమామ్‌హుసేన్, ఆర్ఐ షేక్షావలి, సిబ్బంది చంద్రశేఖర్, రాజగోపాల్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.